''డిగ్రీ ఫైనలియర్!'' అన్చెప్పిన.
''చదువుకుంటున్నవా.. ఏ సబ్జెక్ట్?'' అనడిగిండు.
''బీఎస్సీ కంప్యూటర్స్!'' అన్చెప్పిన.
నమ్మకం కుదరక పక్కకు తీస్కవొయి..
''డిగ్రీ కంప్లీట్ చేసినాక ఏం చేయాలనుకుంటున్నవ్?'' అనడిగిండు.
''లా చేయాలనుకుంటున్న మామ!'' అన్న.
''ఎమ్మెస్సీ రిలెవెంట్ సబ్జెక్ట్ కదా?'' అన్నడు.
''కరెక్టే మామా! కానీ, నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వాలనుకుంటున్న!'' అన్న.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో తృతీయ బహుమతి రూ.10 వేలు పొందిన కథ.

మామనోట ఇంకో ప్రశ్న రాలే.
మూడోరోజు ఇస్తెమా ముగిసినంక మామ కల్సి తన కార్‌ల వాళ్లింటికి పిల్సుకవోయిండు. అది రెండంతస్తుల బిల్డింగ్. గేటు లోపట ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లున్నయి. ఇంట్లెకు వోయినం. కూకోమని లోపలికి వోయిండు మామ. కొద్ది సేపట్లనే అత్తమ్మ వచ్చింది.
''అమ్మి ఆరోగ్యం బాగుందా?'' అనడిగింది.
''బాగానే ఉంది మామి!'' అన్చెప్పిన.
మామగుడా వచ్చి నా పక్కనే కూకుండు. కొద్దిసేపటి తర్వాత టీ, స్నాక్స్ ట్రే వట్కొని ఓ అమ్మాయి వచ్చి.. టీపాయ్ మీద ట్రే వెట్టి నిలవడింది.
నేను జవాబిస్తూ ఆమె వైపు చూసిన. నా కళ్లు చెదిరి వోయినయి. ఎంత అందంగా ఉందో! వీనస్ అంటే ఇలాగే ఉంటుందేమో! ఆమె తిరిగి లోపలికెళ్లింది. ఆమె తన రెండో కూతురని, నీట్ కోచింగ్‌కు వెళ్తున్నదని, పెద్దమ్మాయి – అల్లుడు ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులని చెప్పిండు మామ. ఆయినె చెప్తుంది వింటూ.. టీ తాగిన. కొద్దిసేపు గడిచినాంక..
''నేను బయలుదేర్తా మామ!'' అన్న.
''పోయొస్తా!'' అని అత్తమ్మకు చెప్పిన.
తన కార్‌లనే నల్గొండ బస్టాండ్‌ల దింపిండు మామ. మిర్యాలగూడ బస్సు రెడీగ ఉంది. ఎక్కి కూకున్న.
''అమ్మికి సలాం చెప్పు! వీలు చూసుకొని వస్తానని చెప్పు!'' అన్నడు.
''చెప్త మామ!'' అన్న.
నా సెల్ నెంబర్ తీస్కొని నా ఫోన్‌కు రింగ్ ఇచ్చి, ఫీడ్ చేసుకోమన్నడు. చేస్కున్న. బస్సు కదిలింది. మామలో ఏదో మార్పు కన్పడుతున్నది. అదేందో అర్థం కాలే. ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటింది.
పొద్దున లేసినాంక అమ్మితో నల్గొండలో జుబేర్ మామ కల్సి వాళ్లింటికి పిల్సుకవోయిండని, వీలు సూస్కొని వస్తానన్నాడని చెప్పిన. అమ్మి బవు ఖుషీ అయింది. ఇది జరిగి మూడు నెలలైతున్నది.
నిన్న మామ ఫోన్ చేసి.. ఈ దినం వస్తున్నానని చెప్పిండు. గా ముచ్చట అమ్మికి చెప్పిన. తన అన్న ఎప్పుడొస్తడా!? అని ఎదురు చూస్తున్నట్లుంది అమ్మి.

* * *

''ఉమేర్.. ఉఠోనా!'' అంటూ.. లేపుతున్నది మల్ల.
లేసి ఫ్రెషప్పయి వచ్చి టిఫిన్ చేసి కూకున్న. టైం పద కొండైతుంది. ఇంతల్నే బయటి దర్వాజ తట్టింరెవరో. దర్వాజ కాడ ఏ సప్పుడైనా మామ వచ్చినట్లే ఫీలయితున్నది అమ్మి. వోయి దర్వాజ తీసిన. నన్ను నెట్టుకుంటూ మహేష్‌గాడు లోపలికొచ్చి..
''ఇగో చిన్నమ్మా! అమ్మ శివరాత్రి పండక్కు చేసిన పిండి వంటలు పంపింది!'' అన్నడు చేతిలో సంచి అమ్మికందిస్తూ. అమ్మి సంచి తీస్కొని లోనికివోయింది.
''ఉమేర్.. నాకో చిన్న హెల్ప్ చేయాల్రా! మా పక్కింట్ల ఉండే జగదీశ్ సార్ ఎర్కే కదా? వాళ్ల మామకు బాగ లేదంట. వాళ్లది హుజూర్నగర్ పక్కన ఏదో పల్లెటూరంట! పండగకు ఇంటినిండా సుట్టాలొచ్చి ఉన్నరు! నేను ఆటోకు వోతే బాగుండదు! అందుకే నూ అర్జెంటుగ సార్ వాళ్లనక్కడ డ్రాప్ చేసి రావాల్రా!'' అన్నడు మహేష్.
నేను సరేనని నిన్న పండక్కు కుంకుమ సల్లుకున్న ప్యాంటు షర్టే ఏస్కొని, అమ్మికి చెప్పి బయటవడ్డ.
జగదీశ్ సార్ వాళ్లను డ్రాప్ చేసి తిరిగొచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది. జుబేర్ మామ వచ్చి ఇంట్లె ఉన్నడు.
''ఎంత సేపైంది మామా.. వచ్చి?'' అనడిగిన.
''గంటైతుంది వచ్చి!'' అన్నడు.
స్నానం చేద్దమని షర్ట్ ఇప్పుతుంటే షర్ట్ పైనున్న మరకల్ని సూసి..
''ఏంటా కుంకుమ మరకలు? కాలేజీలో ఎన్నికలేమైనా జరిగినయా?'' అనడిగిండు మామ.
''లేదు! శివరాత్రి నాడు దేవుని ఊరేగింపులో దోస్తులతో కల్సి సల్లుకున్న కుంకుమ మరకలయ్యి!'' అన్నది అమ్మి. జరగరాని ఘోరమేదో జరిగినట్టు అసహనంగా తల ఊపి..
''మన ముస్లిం పిల్లలకు పట్టుకున్న దరిద్రం ఇదే! కొంతైనా 'దీన్' గురించి తెలుసుకోవాలే! ఆచరించాలే! అప్పుడే చేసే పనిల బర్కత్ ఉంటది!'' అన్నడు మామ.
అయి ఉత్త కుంకుమ మరకలు కావని, నా ప్రియ నేస్తాల తీపి గురుతులని, అయి ఏ మత డిటెర్జెంట్ బిళ్లతో ఉతికినా చెరిగిపోవని జుబేర్ మామకు తెలిసే అవకాశమే లేదు.
స్నానం చేసొచ్చిన. రాత్రి తొమ్మిదైతుంది. నర్సమ్మ పెద్దమ్మ దావత్ క్యారేజి తెచ్చిచ్చివొయింది. ప్రతి ఏటా శివరాత్రి ఎల్లిన మరుసటి రోజు నర్సమ్మ పెద్దమ్మనే దావత్ ఇస్తది. ఘుమఘుమలాడ్తున్న బగార అన్నం, యాటకూర వాసనకు నా ఆకలి రెట్టింపైంది. చాలా సేపట్కెల్లి ఎందుకో అమ్మి కిచెన్లనే ఉంది. నేను వొయి..
''ఆకలి దంచేస్తుంది అమ్మి!'' అన్న.
''మామ కోసం అన్నం ఖాగినా వండుతున్న బేటా! జరసేపాగు!'' అన్నది అమ్మి. నేను ఆశ్చర్యవొయి..
''అదేందీ.. నర్సమ్మ పెద్దమ్మ క్యారేజి తెచ్చిచ్చింది కదా?'' అన్న.
''ష్.. గట్టిగ అనకు! గుర్వయ్య పెద్దయ్య గప్పుడెప్పుడో ముద్దార్ యాటకూర తీస్కవోతుంటే మామ సూసినడంట. అప్పటికెల్లి ఆ ఇంట్లె నుంచి ఏది తెచ్చిచ్చినా తినడు!'' చెప్పింది అమ్మి.
''గుర్వయ్య పెద్దయ్య గప్పుడు ఎవల్లకోసం తీస్కవోయిండో ఏమో! నర్సమ్మ పెద్దమ్మ దర్గాలకు వోతది. ప్రతి జుమ్మాకు ఫాతెహాలిప్పిస్తది. వాళ్లు ముద్దార్ తినరని నీకెర్కే కదా అమ్మీ! మామకు చెప్పకవొయినవా? పెద్దమ్మ వాళ్లకు సర్దార్ మామ మటన్ షాప్ల నేనే మటన్